క్లుప్తంగా

వైభవంగా వీరభద్రేశ్వర స్వామి జయంత్యుత్సవం

కోడుమూరు రూరల్: వీరభద్రేశ్వర స్వామి జయంత్యుత్సవాన్ని వీరశైవ లింగాయతీ దేవాచార సంక్షేమ సంఘం సభ్యులు మంగళవారం కోడుమూరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక మల్లేశ్వరస్వామి ఆలయం నుంచి స్వామివారి చిత్రపటాన్ని గ్రామ పురవీధుల గుండా మేళతాళాలతో ఊరేగించారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం సభ్యులు శివప్రసాద్, వీరప్ప, బసవరాజు, దామోదర్, బసన్న, చంద్రశేఖర్, కృష్ణమోహన్, రవీంద్రనాథ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు శాంతిరాం విద్యార్థుల ఎంపిక

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల నంద్యాల గుడ్‌షెప్పర్డ్ పాఠశాలలో జరిగిన ఉమ్మడి జిల్లా బాల్‌బాడ్మింటన్ జూనియర్, సీనియర్ క్రీడా పోటీల్లో తమ కళాశాల కంప్యూటర్ సైన్స్, డెటా సైన్స్ విభాగం విద్యార్థులు శ్రావణి, శ్రీలత,ఉదయ్‌కిరణ్‌లు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం చెప్పారు. వీరు విశాఖలో అక్టోబర్ 5–7వ తేదీల్లో రాష్ట్ర స్థాయి క్రీడ పోటీల్లో పాల్గొంటాన్నారు. ఎండీ శివరామ్, హెచ్‌ఓడీ ఫరూక్, శేషయ్య, క్రీడాకారులను, పీడీ చంద్రారెడ్డిని తదితరులు అభినందించారు.

పీహెచ్‌సీ డాక్టర్ల నిరసన

సి.బెళగల్: జీఓ నంబర్ 85ను వ్యతిరేకిస్తూ మంగళవారం సి.బెళగల్, పోలకల్ పీహెచ్‌సీల వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. జీఓ 85 రద్దును డిమాండ్ చేస్తూ దశలవారి నిరసన కార్యాక్రమంలో భాగంగా సి.బెళగల్ పీహెచ్‌సీ డాక్టర్లు మాధునరెడ్డి, సునీత, పోలకల్ డాక్టర్లు హరిచంద్రుడు, శ్రావణి నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. వారు 11, 12 తేదీలలో వైద్య సేవలకు అంతరాయం లేకుండా నిరసన కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే 14న కేవలం అత్యవసర సేవలు, 15న చలో విజయవాడ, 16 నుంచి నిరవధిక నిరాహార దీక్షలు చేపడుతామన్నారు.

పంటలను పరిశీలించిన ఏఓ

కల్లూరు: మండలంలోని పందిపాడు గ్రామంలో సాగైన పత్తి, కంది, కొర్ర, ఉల్లి, పొగాకు తదితర పంటలను మంగళవారం ఏఓ శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు పంటలు బాగా దెబ్బతిన్నాయని రైతులు ఏఓకు వివరించారు. కొర్ర, పొగాకు ఎర్రగామారి చనిపోతున్నాయన్నాని, అలాగే పత్తి పూత రాలిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు దేవేందర్‌రెడ్డి, శేఖర్ చౌదరి, భీమ్మడు, పురుషోత్తం, నాగరాజు పాల్గొన్నారు.

గోరంట్ల రోడ్డును బాగు చేయించండి

కోడుమూరు రూరల్: గుంతలమయమైన కోడుమూరు నుంచి గోరంట్ల మీదుగా వెల్దుర్తికి వెళ్లే రోడ్డును బాగు చేయించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీరాములు గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం ఏఐవైఎఫ్, ఆటో యూనియన్ నాయకులు ఎంపీడీఓ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం శ్రీరాములు గౌడ్ మాట్లాడుతూ గోరంట్ల వరకు సుమారు 12కిలోమీటర్ల రోడ్డు మోకాటిలోతు గుంతలతో అధ్వాన్నంగా మారిందన్నారు. వాహనదారులు ప్రయాణించలేని పరిస్థితి నెలకొందని, అధికారులు స్పందించి కనీసం మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రంగస్వామి, మధు, వీరాంజనేయులు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద ఉన్న జంబులాపరమేశ్వరీ అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ. 15వేలను దాతలు విరాళంగా అందజేశారు. నంద్యాల పట్టణం నూనేపల్లెకి చెందిన సోమగాని వెంకటరమణ గౌడ్, భార్య పద్మ, కుమారుడు కోమల్‌గౌడ్ విరాళం అందజేశారని ఆలయ ధర్మకర్త బొమ్మిశెట్టి శేఖర్ మంగళవారం తెలిపారు. ప్రత్యేక పూజల అనంతరం దాతలకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని దొంగు సమీపంలో ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైనట్లు హైవే పెట్రోల్ సిబ్బంది తెలిపారు. బనగానపల్లె నుంచి బయలుదేరిన ట్యాంకర్ పెట్రోల్ బంక్ వద్ద సైడ్‌కు వెళ్లడంతో వెనుక వస్తున్న మరో మినీ లారీ ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. హైవే సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్ సమస్య లేకుండా చేశారు.

సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదు

పాణ్యం: సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కాదని, ఓర్పుతో మెలగాలని రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమ కో–ఆర్డినేటర్ డాక్టర్ కాంతరావునాయక్ అన్నారు. ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏమైన సమస్యలు వచ్చినప్పుడు తోటి వారితో పంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్ అశోక్‌కుమార్, మానసిక వైద్యులు శరత్‌చంద్ర, డాక్టర్ రావూస్ ఇంబ్రహీం, వెంకటరామిరెడ్డి, హెచ్‌ఓడీ సోఫియా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే వరదలు

పాణ్యం: విజయవాడ వరద విపత్తుకు ముమ్మాటికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం. ప్రజలకు ముందస్తు సమాచారం లేకుండా బుడమేరుపై ఉన్న గేట్లు ఎత్తి విజయవాడ ప్రజలను నీట ముంచారు. దాదాపు వారం రోజులు అవుతున్నా సహాయ చర్యలు అంతంత మాత్రంగా ఉండడం, ప్రజలకు కనీస మౌలిక సదుపాయలు కల్పించలేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం. విజయవాడ వరద గురించి ప్రభుత్వానికి ముందస్తు సమాచారం ఉన్నప్పటికీ ఏ మాత్రం పట్టించుకోలేదు. ప్రభుత్వం అనాలోచిత నిర్ణయంతో విజయవాడ ప్రజలకు నీటి విపత్తును సృష్టించారు. ప్రజలకు ఎక్కడ నిజాలు తెలుస్తాయనే ఉద్దేశంతో తమ ఎల్లో మీడియాతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయిస్తున్నారు. ఎల్లో మీడియాతో అబద్దాలను నిజాలుగా చిత్రీకరిస్తున్నారు. సర్వం కోల్పోయిన ప్రజలకు కనీస మౌలిక వసతులు కూడా కల్పించలేదు. సర్వం కోల్పోయిన వరద బాధితులకు కనీసం భరోసా కల్పించలేకపోయారు. ఆహార పొట్లాలు, వాటర్‌బాటిళ్లు, బిస్కెట్‌ప్యాకెట్లు ఇన్ని పంచాం... అన్ని ఇచ్చాం అంటూ ప్రచారం చేసుకోవడం టీడీపీ నేతలకే చెల్లింది. వరద బాధితులపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన టీడీపీని త్వరలోనే ప్రజలు నిదీస్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వరద బాధితులకు అన్నివిధాలుగా అండగా నిలువాలి.



కాటసాని రాంభూపాల్‌రెడ్డి
పాణ్యం మాజీ ఎమ్మెల్యే, నంద్యాల జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు



లద్దగిరి హాస్టల్‌లో పెచ్చులూడిన గదులు



లద్దగిరిలో కూలిపోయిన కిచెన్ షెడ్



పాణ్యం ఎస్సీ హాస్టల్‌లో పనిచేయని మినరల్ వాటర్ ప్లాంట్

సమస్యల నిలయాలు..సంక్షేమ హాస్టళ్లు!

- అరకొర వసతులతో అల్లాడుతున్న విద్యార్థులు
- ప్రమాదపుటంచున లద్దగిరి హాస్టల్ భవనాలు
- పెచ్చులూడుతున్న పైనం.. భయపడుతున్న చిన్నారులు



ఆరుబయట స్నానం చేస్తున్న విద్యార్థులు

కోడుమూరు రూరల్: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టళ్లు సమస్యలకు నిలయాలుగా మారాయి. అరకొర వసతులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం కనీస నిధులు సైతం మంజూరు చేయకపోండంత చిన్నచిన్న మరమ్మతులకు నోచుకోని దుస్థితి. హాస్టల్ గదుల కిటికీలు, వాకిళ్లు సరిగా లేకపోవడంతో విద్యార్థులు దోమలు, చలిగాలులతో ఇబ్బందులు పడుతున్నారు. అక్కడక్కడ హాస్టల్ విద్యార్థులు జ్వరాలతో మగ్గుతున్నారు. చాలా హాస్టళ్లలో బాత్‌రూమ్‌లు సరిగాలేక, నీటి సౌకర్యంలేక విద్యార్థులు అత్యవసరాలకు బయటకు వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. మరి కొన్ని హాస్టళ్లలో బాత్‌రూమ్‌లు ఉన్నప్పటికీ మరమ్మతులకు గురికావడంతో నిరూపయోగంగా మారాయి. ఇక బాలికల ఇబ్బందులు చెప్పనలవి కావు. సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు వంట వండేందుకు కావాల్సిన వంట మనుషులు పూర్తిగా లేరు. కొన్ని హాస్టళ్లలో స్వీపర్లు లేక వంట మనుషులతోనే శుభ్రం చేయించాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రమాద ఘంటికలు మోగిస్తున్న లద్దగిరి బీసీ హాస్టల్

కోడుమూరు మండలం లద్దగిరి బీసీ హాస్టల్–1,2 భవనాలు ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. హాస్టల్ భవనం 50సంవత్సరాల క్రితం నిర్మించింది కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరింది. కూలేందుకు సిద్ధం అన్నట్లుగా ఉండడంతో అధికారులు తాత్కలికంగా స్థానిక హైస్కూల్లో వసతిని ఏర్పాటు చేశారు.

లద్దగిరి బీసీ హాస్టల్‌లో విద్యార్థుల అవస్థలు

లద్దగిరి బీసీ బీసీ వెల్ఫేర్ వసతి గృహం–1లో 222మంది విద్యార్థులుండగా, వసతి గృహం–2లో 230మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఒక గదిలో నిలబడితే 150మంది సరిపోదు.. అలాంటి గదిలో రాత్రి పూట 120మంది నిద్రపోవాల్సిన పరిస్థితి. 452మంది విద్యార్థులకు సరిపడే బాత్‌రూమ్‌లు లేక ఆరుబయట స్నానాలు చేస్తున్నారు. వంట వండే రేకుల కిచెన్ షెడ్ పూర్తిగా దెబ్బతింది. వర్షం వస్తే పడరానిపాట్లు తప్పవు.

☛ కోడుమూరులోని బీసీ, ఎస్సీ బాలికల హాస్టళ్లలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. బోర్లు లేకపోవడంతో రెండు హాస్టళ్ల విద్యార్థినులు పూర్తిగా గ్రామ పంచాయతీ సరఫరా చేసే కుళాయిల నీటిపైనే ఆధారపడాల్సి వస్తోంది. నీరు సరిపోక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలు భరించలేక కొందరు టీసీలు తీసుకెళ్లినట్లు సమాచారం.

☛ కోడుమూరు మండలంలోని గోరంట్ల గురుకుల పాఠశాల, అమడగుంట్ల బీసీ హాస్టళ్లకు కాంపౌండ్ లేక నిత్యం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

సి.బెళగల్‌లోనూ అదే పరిస్థితి....

☛ సి.బెళగల్‌లోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, ఎస్సీ, బీసీ, హాస్టళ్లకు ప్రహరీలు లేవు. దీంతో పశువులు, కుక్కలు, పందులు విద్యార్థులు ఉండే పరిసర ప్రాంతాల్లోకి వస్తున్నాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పది రోజులుగా గురుకుల, ఎస్సీ, బీసీ, హాస్టళ్ల విద్యార్థులు అనారోగ్యానికి గురికావడంతో వారిని వార్డెన్లు ఇళ్లకు పంపిస్తున్నారు. బీసీ హాస్టల్‌లో సిబ్బంది కొరత వేధిస్తుంది.

☛ సి.బెళగల్‌లోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 8 గదులు పూర్తిగా శిథిలావస్థలో ఉన్నాయి. కొన్ని గదుల్లో టాప్‌లు పూర్తిగా కూలి పడిపోయాయి. కారిడర్ మొత్తం పెచ్చులూడి అప్పుడు ఇప్పుడో కూలేందుకు సిద్ధం అన్నట్లుగా ఉంది.

వసతి గృహాలు... అధ్వానం!

పాణ్యం: సాంఘిక సంక్షేమ హాస్టళ్లు అధ్వానంగా మారాయి. కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిగా గాలికొదిలేసింది. దీంతో హాస్టల్ విద్యార్థులు సమస్యల మధ్య మగ్గుతున్నారు. చాలా వసతి గృహాల్లో సురక్షితమ మంచినీరు కరువైంది. హాస్టల్ భవనాలు సరిగ్గా లేకా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గృహాల్లో భవనాల పైపెచ్చులు ఊడి పడుతున్నాయి. భయంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదిస్తున్నారు. సిబ్బంది కొరత మూలంగా ఇబ్బందులు తప్పడం లేదు. కొన్ని వసతి గృహాల్లో విద్యార్థులే భోజనం వడ్డించుకుంటున్నారు. మండల కేంద్రం పాణ్యంలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో విద్యార్థులకు సురక్షిత మంచినీరు అందడం లేదు. అక్కడ ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్‌లు మరమ్మతులకు గురైనా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. వసతిగృహానికి కాంపౌండ్‌వాల్ లేకపోడంతో రాత్రివేళల్లో విద్యార్థులు భయాందోళనకు గురువుతున్నారు.

- మండల కేంద్రమైన గడివేములలో బీసీ వసతి గృహానికి డోర్లు, కిటికీలు సరిగ్గాలేకపోవడంతో దోమలు, చలితో ఇబ్బందులు పడుతున్నారు. వసతి గృహంలో మొత్తం 6గదులు ఉన్నప్పటికీ ఫ్యాన్లు సరిగ్గా పని చేయడం లేదు. అలాగే మరుదొడ్లు తలుపుల పూర్తి కుళ్లిపోయాయి. మరుగుదొడ్లలో కుళాయిలు పని చేయడం లేదు.
- ఓర్వకల్లు మండలంలోని కాల్వబుగ్గ ఏపీఆర్ రెసిడెన్సియల్ పాఠశాలలో 430 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. అరకొర వసతులతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. భోజనం విద్యార్థులే వడ్డించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఎస్సీ బాలికల వసతి గృహం పరిస్థితి దారుణంగా ఉంది. లొద్దిపల్లె, మీదివేములలో వేరువేరు బీసీ వసతిగృహాలలో విద్యార్థులు అసౌకర్యాలతో పడరాని పాట్లు పడుతున్నారు. బాలుర వసతి గృహానికి ప్రహరీ లేక విద్యార్థులు భయపడుతున్నారు. మరుగుదొడ్లకు నీటి వసతి లేక నిరుపయోగంగా వదిలేశారు. లొద్దిపల్లె బీసీ బాలుర వసతి గృహం భవనం పాతది కావడంతో పూర్తి అసౌకర్యంగా మారింది. పెచ్చులూడి కాంక్రీట్ కడ్డీలు కనిపిస్తున్నాయి. దీంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు.
- కల్లూరు మండలం పర్ల గ్రామంలోని ఎస్సీ బాలుర వసతి గృహం పాత భవనం కావంతో పై నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయి. ఉలిందకొండ ఎస్సీ బాలుర హాస్టల్‌లో మరుగుదొడ్లు సరిగ్గాలేవు. పెద్దపాడు ఎస్సీ బాలుర బాలుర హాస్టల్, పెద్దపాడు బీసీ బాలుర వసతి గృహంలోనూ ఇదే పరిస్థితి.



కాల్వ బుగ్గ గురుకుల వసతి గృహంలో విద్యార్థులే అన్నం వడిస్తున్న దృశ్యం



గడివేములలో హాస్టల్‌లో ధ్వంసమైన మెట్లు



పర్ల ఎస్సీ బాలుర వసతి గృహంలో పైకప్పు పెచ్చులూడిన దృశ్యం



బీసీ హాస్టల్ గదికి తలుపులు లేని దృశ్యం

ప్రతి రైతుకూ న్యాయం చేస్తాం

సాక్షి ఎఫెక్ట్

గడివేముల: నకిలీ విత్తనాలతో నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం చేస్తామని నంద్యాల వ్యవసాయ శాస్త్ర వేత్తలు తెలిపారు. ఆగస్టు 23వ తేదిన సాక్షి దినపత్రికలో వచ్చిన 'నట్టేట ముంచిన మొక్కజొన్న విత్తనాలు' కథనానికి అధికారులు సానుకూలంగా స్పందిచారు. దెబ్బతిన్న మొక్కజొన్న పంటను 24న ఏఓ పరిశీలించిన విషయం తెలిసిందే. ఈ మేరకు మంగళవారం నంద్యాల వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ అశోక్ కుమార్, డాక్టర్ వెంకటరమణమ్మ, డాక్టర్ ఇషా పర్వీన్ ఏఓ హేమసుందర్‌రెడ్డితో కలిసి నకిలీ విత్తనాలతో కాపురాని మొక్కజొన్న పరిశీలించారు. మొక్కజొన్న కంకులను సేకరించారు. గతంతో ఎంత దిగుబడి వచ్చింది... ఇప్పుడు ఎంత దిగుబడి వస్తుందని రైతులను శాస్త్రవేత్తలు అడిగితెలుసుకున్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



మంచాలకట్టలో నకిలీ విత్తనాలతో కాపురాని మొక్కజొన్న పైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

రైతులను ఆదుకోవాలి



దెబ్బతిన్న కొర్ర పంటను పరిశీలిస్తున్న నాయకులు

కోడుమూరు రూరల్: అధిక వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి జగన్నాథం డిమాండ్ చేశారు. మంగళవారం కోడుమూరులో వర్షాలకు దెబ్బతిన్న కొర్రపంటను రైతు సంఘం నాయకులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ పత్తి, కొర్ర, సజ్జ, ఉల్లి తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గిడ్డయ్య, తిమ్మయ్య, పంపనగౌడ్, కృష్ణ, రాజు పాల్గొన్నారు.

మూడవ రోజూ అగచాట్లే..

పాణ్యం: మండల పరిధిలోని పిన్నాపురం ఘాట్‌లో నిలిచిపోయిన ట్యాంకర్ వలన గ్రామ ప్రజలకు మూడవ రోజు మంగళవారం అగచాట్లు తప్పలేదు. గ్రీన్ పరిశ్రమకు వెళ్లాల్సిన ట్యాంకర్ ఘాట్‌లో నిలచిపోయిన విషయం తెలిసిందే. రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కేవలం ద్విచక్ర వాహనాలు, అతి కష్టమీద ఆటోలు మాత్రమే వెళ్తున్నాయి.



వరద బాధితుల సహాయార్థం ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డికి రూ.లక్ష అందజేస్తున్న భారతి సిమెంట్ డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి

గంగమ్మ ఒడి చేరిన గణనాథులు



వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకెళ్తున్న దృశ్యం



గడివేములలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

ఓర్వకల్లు: నాలుగు రోజుల పాటు భక్తుల నుంచి విశేష పూజలు అందుకున్న గణనాథులు మంగళవారం గంగమ్మ ఒడి చేరుకున్నారు. మండల కేంద్రం ఓర్వకల్లుతో పాటు హుస్సేనాపురం, కేతవరం గ్రామంలో కొలువుదీరిన గణేష్ విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. ఓర్వకల్లులో–18, హుసేనాపురంలో–10, కేతవరంలో–3 విగ్రహాల చొప్పున నిమజ్జనం చేశారు. డప్పులు, బాజా బజింత్రీలు మధ్య గణనాథులను ఊరేగింపుగా తీసుకెళ్లి సమీపంలోని కుందూవాగు, కాల్వబుగ్గ వాగు, నీటికుంటల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. యువత రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. ఓర్వకల్లులోని వినాయకగుడి వద్ద ఏర్పాటు చేసిన స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని చాకలి మధు రూ.25 వేలకు, వీరభద్రస్వామి వద్ద కొలువుంచిన స్వామి లడ్డూను వాటర్ ప్లాంట్ గోవిందరెడ్డి రూ. 22 వేలకు, కొడపేటలో కొలుదీరిన స్వామివారి లడ్డూను టంగుటూరి శంకర్‌రెడ్డి రూ.21 వేలకు దక్కించుకున్నారు. రూరల్ సీఐ చంద్రబాబునాయుడు, స్థానిక ఎస్‌ఐ సునీల్ కుమార్ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

గడివేముల: మండల కేంద్రం గడివేములలో కొలువుదీరిన గణనాథులను మంగళవారం నిమజ్జనానికి తరలించారు. యువకుల కేరింతలు, డప్పువాయిద్యాల మధ్య గంగమ్మ ఒడికి తరలివెళ్లారు గణపయ్యలు. గ్రామ సమీపాన కుందూ నదిలో గణనాథులను నిమజ్జనం చేశారు. శివాలయంలో కొలువుదీరిన గణేష్ లడ్డూ ప్రసాదాన్ని గ్రామానికి చెందిన అమర్‌నాథ్‌రెడ్డి రూ.36 వేలకు దక్కించుకున్నాడు. సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఐ నాగార్జునరెడ్డి పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

గణపయ్యకు ప్రత్యేక పూజలు

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో కొలువుదీరిన గణనాథునికి మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండల వ్యాప్తంగా కొలువుదీరిన గణపయ్యలను మూడురోజుల పూజల అనంతరం సోమవారం నిమజ్జనం చేసిన విషయం తెలిసిందే. అయితే పోలకల్ గణనాథుడిని ఐదురోజుల అనంతరం బుధవారం నిమజ్జనం చేయనున్నారు. ఈ మేరకు సుంకేసుల దగ్గర తుంగభద్ర నదిలో నిమజ్జనం చేసేందుకు గ్రామ పెద్దలు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పాణ్యం: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని కొలువుదీరిన గణనాథులకు నాల్గవ రోజు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం తెల్లవారుజామునే గణపతికి అభిషేకాలు, అర్చనలు, బిల్వార్చన పూజలు చేశారు. ఎస్సీ కాలనీ వద్ద భృంగీశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన గనపతి మండపం వద్ద అన్నదానం చేపట్టారు.



చెన్న సోమేశ్వర ఆలయం దగ్గర కొలువుదీరిన మహా గణనాథుడు



పాణ్యం బస్టాండ్‌లో కొలువదీరిన బొజ్జగణపయ్య

ఇసుక బుకింగ్ కేంద్రం ప్రారంభం



సి.బెళగల్ సచివాలయం దగ్గర ఇసుకను బుకింగ్ చేసుకుంటున్న వాహనదారులు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్లో సోమవారం నిలిచిపోయిన ఇసుక బుక్కింగ్ ప్రక్రియ మంగళవారం తిరిగి ప్రారంభం అయ్యింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న గ్రామ సచివాలయం – 2లో ఇసుక బుకింగ్ కేంద్రంగా ఏర్పాటు చేసిన అధికారులు సోమవారం ముందస్తు సమాచారం ఇంకుండా నిలిపి వేశారు. విషయం తెలియని ప్రజలు, వాహనదారులు సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి బుకింగ్ లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. దీంతో సాక్షి దినపత్రికలో సి.బెళగల్‌లో నిలిచిన ఇసుక బుకింగ్ శీర్షికన కథనం వెలువడింది. స్పందించిన అధికారులు మంగళవారం యథావిధిగా కేంద్రాన్ని ప్రారంభించారు. 55 టిప్పర్లు, 50 ట్రాక్టర్లతో 1,325 టన్నుల ఇసుక బుక్ అయినట్లు వీఆర్వోలు జాకీర్, రఫీ తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్

పిచ్చి మొక్కల తొలగింపు



శుభ్రంగా ఉన్న ఎంపీడీఓ కార్యాలయ పరిసరాలు

కోడుమూరు రూరల్ : కోడుమూరులోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను ఎట్టకేలకు అధికారులు తొలగించారు. ప్రజల ఇబ్బందులను వివరిస్తూ ఈనెల 9న 'సాక్షి' దినపత్రికలో ప్రచురించిన 'అటవి కాదు..ఎంపీడీఓ కార్యాలయ పరిసరాలు' కథనానికి అధికారులు సానుకూలంగా స్పందించారు. రెండు రోజులుగా మినీ జేసీబీతో ఎంపీడీఓ కార్యాలయ పరిసరాల్లో పెరిగిన మొక్కలను తొలగించారు. దీంతో ఎంపీడీఓ కార్యాలయ ఆవరణ శుభ్రంగా తయారైంది. సాక్షి దినపత్రికతోపాటు అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.